# కాబూలీల కొత్త చరిత్ర

## చరిత్రాత్మక విజయంతో తొలిసారి ప్రపంచ కప్ సెమీస్‌కు

కీలక పోరులో బంగ్లాదేశ్‌పై ఉత్కంఠ విజయం ● రషీద్, నవీనుల్ సూపర్ బౌలింగ్ ● మెగాటోర్నీ నుంచి ఆసీస్ ఔట్

'గ్రూప్ స్టేజ్ దాటితే గొప్ప, సూపర్ 8కు వస్తే అదృష్టం!!' ఇదీ ఇన్నాళ్లు అఫ్గానిస్థాన్ క్రికెట్ జట్టు మీద ఉన్న భావన. కానీ కరేబియన్ గడ్డపై కాబూలీలు కొత్త చరిత్ర లిఖించారు. గతేడాది వన్డే ప్రపంచకప్‌లో అంచనాలకు మించి రాణించిన ఆ జట్టు తాజాగా టీ20 ప్రపంచకప్‌లోనూ అదరగొడుతోంది. తాలిబన్ల చెరలో నలిగిపోతున్న ఆ దేశ భావితరానికి 'దిక్సూచి'గా నిలుస్తూ తొలిసారి ఓ ఐసీసీ టోర్నీలో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లి తమ దేశంలో ఈ ఆటను కెరీర్‌గా ఎంచుకోవాలనుకుంటున్న కుర్రాళ్లకు కొత్తదారి చూపారు. సూపర్-8లో బంగ్లాదేశ్‌తో చావో రేవో తేల్చుకోవాల్సిన మ్యాచ్‌లో బ్యాట్‌తో అంతగా ఆకట్టుకోలేకపోయినా తమకు అచ్చొచ్చిన బంతితో మాత్రం సత్తాచాటారు. చేసింది స్వల్ప స్కోరే అయినప్పటికీ కాబూలీ బౌలర్ల 'పట్టు'దల ముందు బంగ్లా పులులు తోకముడవక తప్పలేదు. చరిత్రాత్మక విజయంతో కంగారూల దింపుడుగల్లం ఆశలపై నీళ్లు చల్లిన అఫ్గానులు.. గురువారం (జూన్ 27) దక్షిణాఫ్రికాతో జరిగే తొలి సెమీస్‌లో అమీతుమీ తేల్చుకోనున్నారు.



కింగ్స్‌టౌన్ (సెయింట్ లూసియా): టీ20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్ సంచలనాల జైత్రయాత్ర దిగ్విజయంగా కొనసాగుతోంది. ఈ టోర్నీలో న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి అగ్రశ్రేణి జట్లకు షాకిచ్చిన ఆ జట్టు సెమీస్ రేసులో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌ను 8 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ విధానంలో)తో ఓడించి ఐసీసీ టోర్నీలలో తొలిసారి సెమీఫైనల్స్‌కు అర్హత సాధించింది. వర్షం కారణంగా 19 ఓవర్లలో 114 పరుగులకు కుదించిన ఛేదనలో బంగ్లాదేశ్ 17.5 ఓవర్లలో 105 పరుగుల వద్దే ఆగిపోయింది. రషీద్ ఖాన్ (4/23), 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' నవీనుల్ హక్ (4/26) బంగ్లాను కట్టడిచేశారు. లిటన్ దాస్ (49 బంతుల్లో 54 నాటౌట్, 5 ఫోర్లు, 1 సిక్స్) పోరాడినా బంగ్లాకు పరాభవం తప్పలేదు. మొదట బ్యాటింగ్‌కు వచ్చిన అఫ్గాన్ నిర్ణీత ఓవర్లలో 115 పరుగులే చేయగలిగింది. రెహ్మానుల్లా గుర్బాజ్ (55 బంతుల్లో 43, 3 ఫోర్లు, 1 సిక్స్) కీలక ఇన్నింగ్స్ ఆడాడు.

### బ్యాట్‌తో విఫలం..

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్గానిస్థాన్ ఇన్నింగ్స్ గత మ్యాచ్‌ల కంటే భిన్నంగా సాగింది. బంగ్లా బౌలర్లు లైన్ అండ్ లెంగ్త్ బంతులతో కట్టడి చేయడంతో ఓపెనర్లకు పరుగుల రాక కష్టమైంది. 29 బంతులాడిన జద్రాన్ 18 పరుగులే చేశాడు. గుర్బాజ్ కూడా బ్యాట్ ఝుళిపించలేకపోయాడు. అజ్మతుల్లా (10) విఫలమయ్యాడు. బంగ్లా స్పిన్నర్ రిషద్ హొసెన్ (3/26) జద్రాన్‌తో పాటు ప్రమాదకర గుల్బాదిన్‌ను ఔట్ చేశాడు. 16 ఓవర్ల పాటు క్రీజులో ఉన్నా గుర్బాజ్ వేగంగా ఆడలేకపోయాడు. అతడూ రిషద్ బౌలింగ్‌లోనే ఔట్ అయ్యాడు. ఆఖర్లో కెప్టెన్ రషీద్ (10 బంతుల్లో 19 నాటౌట్, 3 సిక్సర్లు)మెరుపులతో ఆ జట్టు మూడంకెల స్కోరును దాటింది.

### బంతితో సూపర్ హిట్..

బ్యాట్‌తో విఫలమైనా బంతితో మాత్రం అఫ్గాన్ అదరగొట్టింది. రెండో ఓవర్లోనే ఫరూఖీ.. తాంజిద్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని బంగ్లా వికెట్ల పతనానికి తెరతీశాడు.


నవీనుల్ హక్ (4/26)

నవీనుల్ మూడో ఓవర్ వరుస బంతుల్లో శాంటో (5), షకిబ్ అల్ హసన్(0)ను పెవిలియన్‌కు చేర్చి ఆ జట్టును దెబ్బతీశాడు. రషీద్ రంగ ప్రవేశంతో బంగ్లా పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యి మీద పడ్డట్టైంది. సౌమ్య సర్కార్ (10), తౌవిద్ (14), రిషద్ (0) అతడి స్పిన్ మాయకు కుదేలయ్యారు. లిటన్ పోరాడినా నవీనుల్ లోయరార్డర్ పని పట్టి అఫ్గాన్‌ను సెమీస్‌కు చేర్చాడు.

**సంక్షిప్త స్కోర్లు:**
**అఫ్గానిస్థాన్:** 20 ఓవర్లలో 115/5 (గుర్బాజ్ 43, రషీద్ 19 నాటౌట్, రిషద్ 3/26, టస్కిన్ 1/12).
**బంగ్లాదేశ్:** 17.5 ఓవర్లలో 105 ఆలౌట్ (లిటన్ 54 నాటౌట్, తౌవిద్ 14, రషీద్ 4/23, నవీనుల్ 4/26)

**1** ఐసీసీ టోర్నీలలో సెమీఫైనల్ చేరడం అఫ్గానిస్థాన్‌కు ఇదే తొలిసారి.



**మిన్నంటిన సంబరాలు**
*టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్‌పై చారిత్రక విజయం సాధించిన వేళ అఫ్గానిస్థాన్‌లో అభిమానుల సంబరాలు మిన్నంటాయి. ఐసీసీ మెగాటోర్నీల్లో తొలిసారి తమ దేశ జట్టు సెమీస్‌కు అర్హత సాధించడంతో ఫ్యాన్స్ పెద్ద ఎత్తున రోడ్లమీదికి వచ్చి సంతోషంలో మునిగితేలారు. ఈ సందర్భంగా తమ దేశ క్రికెట్‌కు సహకరించిన బీసీసీఐకి తాలిబన్ ప్రభుత్వం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.*

# అబ్బ.. కమలాసన్!

### గుల్బాదిన్ 'ఉత్తుత్తి గాయం'పై ఆటాడుకున్న నెటిజన్లు



కింగ్స్‌టౌన్: బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో అఫ్గాన్ ఆటగాడు గుల్బాదిన్ నయిబ్ 'ఉత్తుత్తి గాయం'పై వివాదం నెలకొంది. హెడ్‌కోచ్ జొనాథన్ ట్రాట్ సూచనల మేరకు స్లిప్స్‌లో ఫీల్డింగ్ చేస్తున్న అతడు.. అప్పటి దాకా బాగానే ఉన్నా ఏదో మంత్రం వేసినట్టుగా కింద పడిపోవడం, ఆ తర్వాత ఫీల్డ్ నుంచి బయటకు వెళ్లడం, ఆ వెంటనే వర్షంతో మ్యాచ్ కాసేపు నిలిచిపోవడం, మళ్లీ కొద్దిసేపటికే గుల్బాదిన్ తనలో ఉసేన్ బోల్ట్ పూనినట్టు వేగంగా పరుగెత్తడం చూస్తే అదేదో సినిమాలో చెప్పినట్టు 'అంతా కమ్ అండ్ గో'లా జరిగిపోయాయి. ఇంతకీ ఏం జరిగిందంటే.. బంగ్లా ఇన్నింగ్స్‌లో 12వ ఓవర్ వేస్తున్న నూర్ అహ్మద్.. 4 బంతి వేయడానికి సిద్ధంగా ఉన్నాడు. అదే సమయంలో చిన్నగా చిరుజల్లులు పడుతున్నాయి. సరిగ్గా అదే సమయానికి అఫ్గాన్ డగౌట్ నుంచి ట్రాట్.. 'వర్షం వచ్చేట్టు ఉంది. స్లో డౌన్ స్లో డౌన్' అంటూ సైగ చేశాడు. కోచ్ సైగలు పసిగట్టిన గుల్బాదిన్.. 'అయ్యో.. నా కండరాలు పట్టేశాయి. నేనిక నడవలేను!' అనేంత రేంజ్‌లో అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఫిజియో వచ్చి గుల్బాదిన్ 'తెచ్చిపెట్టుకున్న గాయాని'కి చికిత్స చేసేందుకు అతడిని ఫీల్డ్ నుంచి బయటకు తీసుకెళ్లి డ్రామాను మరింత రక్తి కట్టించాడు. గుల్బాదిన్ కిందపడిపోయే సమయానికి బంగ్లా స్కోరు 81/7గా ఉండగా వర్షం వస్తే మ్యాచ్ ఆగిపోతే డక్‌వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం ఆ జట్టు విజయానికి రెండు పరుగుల దూరంలో ఉంది. ఈలోగా చిరుజల్లులు పెద్దవవడంతో మ్యాచ్ కొద్దిసేపు ఆగిపోయింది. ఏదేమైనా గుల్బాదిన్ చేసిన ఈ పనికి మాజీ క్రికెటర్ మైఖేల్ వాన్‌తో పాటు భారత స్పిన్నర్ అశ్విన్ ఎక్స్‌లో సెటైర్లు సంధించారు. ఇక నెటిజన్లు అయితే 'ఆస్కార్ లెవల్ యక్టింగ్' అంటూ మీమ్స్, ట్రోల్స్‌తో గుల్బాదిన్‌ను ఆటాడుకున్నారు. 'అబ్బ కమలాసన్ మస్తు షేడ్స్ ఉన్నాయన్న స్టయిల్‌లో' అఫ్గాన్ మ్యాచ్ ముగిశాక ఇదే గుల్బాదిన్.. స్టేడియం అంతా కాళ్లల్లో స్ప్రింగులు వేసుకున్నాడా? అన్న చందంగా పరుగెత్తడం కొసమెరుపు!



# ముగిసిన వార్నర్ కెరీర్

ఆస్ట్రేలియా నిష్క్రమణతో రిటైర్మెంట్!



సెయింట్‌లూసియా: పదిహేనేండ్ల అంతర్జాతీయ క్రికెట్ కెరీర్‌కు డేవిడ్ వార్నర్ వీడ్కోలు పలికాడు. ఇప్పటికే టెస్టులు, వన్డేల నుంచి తప్పుకున్న వార్నర్.. టీ20 ప్రపంచకప్ తర్వాత అన్ని ఫార్మాట్ల నుంచి రిటైర్ అవుతానని ఇదివరకే ప్రకటించిన విషయం తెలిసిందే. సోమవారం భారత్ చేతిలో ఆసీస్ ఓటమితో పాటు బంగ్లాదేశ్‌ను ఓడించిన అఫ్గానిస్థాన్.. ఆసీస్ సెమీస్ ఆశలపై నీళ్లు చల్లడంతో వార్నర్ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడ్డట్టైంది. 2009లో అంతర్జాతీయ క్రికెట్‌లో అరంగేట్రం చేసిన వార్నర్.. 110 టీ20లు, 112 టెస్టులు, 161 వన్డేలు ఆడాడు.

# 'డక్‌వర్త్' కన్నుమూత




లండన్: వర్షం వస్తే క్రికెట్ మ్యాచ్‌ల ఫలితాలను నిర్దేశించే 'డక్‌వర్త్ లూయిస్' పద్ధతిని కనుగొన్న సృష్టికర్తలలో ఒకరైన ఫ్రాంక్ డక్‌వర్త్ కన్నుమూశారు. 84 ఏండ్ల డక్‌వర్త్ ఈనెల 21న మరణించినట్టు ఈఎస్పీఎన్ ఒక కథనంలో పేర్కొంది. ఇంగ్లండ్‌కు చెందిన ఈ గణాంకవేత్త.. టోనీ లూయిస్‌తో కలిసి రూపొందించిన విధానాన్ని క్రికెట్‌లో 1997 నుంచి అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) అమలుచేస్తోంది. ఆస్ట్రేలియా స్టాటిస్టిషియన్ స్టీవెన్ స్టెర్న్ సూచించిన పలు మార్పుల తర్వాత ఐసీసీ ఈ విధానాన్ని 'డక్‌వర్త్ లూయిస్ స్టెర్న్ - డీఎల్ఎస్)గా మార్చింది. టోనీ లూయిస్ 2020లోనే మరణించారు. 2010లో డక్‌వర్త్, లూయిస్‌కు ప్రతిష్టాత్మక మెంబర్ ఆఫ్ ఆర్డర్ ఆఫ్ ద బ్రిటీష్ ఎంపైర్ (ఎంబీఈ) అవార్డు లభించింది.

# సుహాస్ @1

ఢిల్లీ: భారత పారా షట్లర్ సుహాస్ యతిరాజ్ ప్రపంచ పారా బ్యాడ్మింటన్ ర్యాంకులలో అగ్రస్థానానికి ఎగబాకాడు. మంగళవారం బీడబ్ల్యూఎఫ్ ప్రకటించిన పారా బ్యాడ్మింటన్ వరల్డ్ ర్యాంకింగ్స్ (పురుషుల సింగిల్స్)లో సుహాస్.. ఫ్రెంచ్ షట్లర్ లుకాస్ మజుర్‌ను వెనక్కినెట్టి అగ్రస్థానం కైవసం చేసుకున్నాడు. 60,527 పాయింట్లతో సుహాస్ మొదటి స్థానంలో ఉండగా 58,953 పాయింట్లతో లుకాస్ రెండో స్థానానికి పడిపోయాడు. టోక్యో ఒలింపిక్స్‌లో ఎస్-4 కేటగిరీలో రజతం నెగ్గిన సుహాస్ ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో ఐఏఎస్ అధికారిగా పనిచేస్తున్నాడు.

# అభినవ్‌కు స్వర్ణం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ రైఫిల్ అసోసియేషన్(టీఆర్ఏ) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఐపీఎస్ అధికారి అభినవ్ పసిడి పతకంతో మెరిశాడు. మంగళవారం జరిగిన 25 మీటర్ల సెంటర్ ఫైర్ పిస్టల్ విభాగంలో అభినవ్(280) అగ్రస్థానంలో నిలువగా, నీరజ్(275), వీక్షిత్‌వీర్(272) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. మిగతా విభాగాల్లో అనిల్‌కుమార్, ఫైజల్, యువక్, రష్మిని, నిరంజన్ స్వర్ణాలు సాధించారు.




Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.